క్లుప్తంగా

శక్తీశ్వరస్వామికి విశేష పూజలు



విశేష అలంకరణలో శక్తీశ్వరస్వామి

భీమవరం అర్బన్: మండలంలోని యనమదుర్రు గ్రామంలో పార్వతి సమేత శక్తీశ్వర స్వామికి ఆషాఢ మాసం సందర్భంగా మంగళవారం వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ముందుగా ఆలయ అర్చకులు మద్దిరాల సత్యనారాయణమూర్తి, కొడమంచిలి తమ్మిరాజులు స్వామివార్లకు సహస్రనామార్చన, పంచామృత అభిషేకాలు, గోక్షీరాభిషేకాలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వివిధ పుష్పాలతో ప్రత్యేకంగా స్వామివార్లను అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను ఆలయ కార్యనిర్వహణాధికారి కృష్ణంరాజు, ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

అమ్మవారి స్వర్ణ వస్త్ర నిధికి విరాళం



దాతలను సన్మానిస్తున్న ఆలయ అధికారులు

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలో మావుళ్లమ్మ అమ్మవారికి పట్టణానికి చెందిన బీహెచ్ సాయి సహస్ర రూ.లక్ష శాశ్వత నిత్యాన్నదానంకు, అమ్మవారి స్వర్ణ వస్త్ర నిధికి ఎనిమిది గ్రాముల బంగారాన్ని విరాళంగా సమర్పించారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జున ప్రత్యేక పూజలు నిర్వహించి చేశారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ శేషవస్త్రం ఫోటో ప్రసాదాలు అందజేశారు.

విద్యార్థులకు ఉత్తమ విద్యను అందజేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ మొగిలి వెంకటేశ్వర్లు

భీమవరం (ప్రకాశంచౌక్): అధ్యాపకులు విద్యార్థులకు ఉత్తమ విద్యను అందజేయాలని డీఆర్‌ఓ మొగిలి వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ డీఆర్‌ఓ చాంబర్‌లో కాంట్రాక్టు లెక్చర్ల సర్వీసు కొనసాగింపుపై తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు అటానమస్ బాలికల కళాశాల, భీమవరం, గణపవరం, దుంపగడప ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ తో సమీక్షించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మొగిలి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఐదు సంవత్సరాలలోపు సర్వీసు ఉన్న కాంట్రాక్టు లెక్చరర్‌లను వారు పని చేస్తున్న కళాశాలలోనే కొనసాగించేలా నిర్ణయించడం జరిగిందన్నారు. పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు చదువుకునే ప్రభుత్వ కళాశాలలోని అధ్యాపకులు వారికి మంచి చదువుని అందజేసి ప్రయోజకులను చేయాలని ఈ సందర్భంగా కోరారు. ఈ సమావేశంలో ఆయా కళాశాల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

రైతుల సహకారంతో వంతెన నిర్మాణం



నూతనంగా నిర్మించిన వంతెన వద్ద మాట్లాడుతున్న సత్యనారాయణ

కాళ్ల: రాజకీయ పార్టీలతో ప్రమేయం లేకుండా తమ పంటపొలాలకు వెళ్లేందుకు ఆయకట్టు రైతులంతా ఏకమై వంతెన నిర్మాణంకు ముందుకు రావడం శుభపరిణామని రైతు గడి సత్యనారాయణ అన్నారు. మండలంలోని పెదఅమిరం గ్రామం పరిధిలో వాండ్రం–పెదఅమిరం గ్రామాలను కలుపుతూ నారాయణకోడు కాలువపై రైతుల సహకారం సుమారు రూ.5 లక్షలతో నూతనంగా నిర్మించిన వంతెన వద్ద మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పెదపుల్లేరు, వాండ్రం మీదుగా పెదఅమీరం చేరుకోవటానికి ఇది దగ్గర మార్గమన్నారు. రైతులు వేగేశ్న శ్రీనివాసరాజు, చిలుకూరి నరసింహారాజు, భూపతిరాజు సుబ్బరాజు, గమిని జువెలర్స్ ప్రసాద్, గాదిరాజు శ్రీనివాసరాజు, దేవి క్లాత్స్ సుబ్బారావు ల సహకారంతో వంతెన నిర్మాణం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ వంతెన నిర్మాణం వల్ల రైతులతో పాటు వాహనదారులకు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. వంతెన నిర్మాణానికి సహకరించిన రైతులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

నరసాపురం రూరల్: విద్యాభివృద్ధికి దాతలు చేస్తున్న కృషి అభినందనీయమని పలువురు అభిప్రాయపడ్డారు. మంగళవారం మండలంలోని సీతారామపురం, కొత్తపేట గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు దళిత జేఏసీ, రాజ్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు.

రోడ్లు ఇలా.. ప్రయాణమెలా?

దారుణంగా ఉప్పుగుంట–అర్తమూరు రహదారి



ఉప్పగుంట–అర్తమూరు శివారు రోడ్డు దుస్థితి



యండగండి శివారు రాయనివానిగూడెం రోడ్డు ఇలా

ఉండి: మండలంలోని ఉప్పుగుంట–అర్తమూరు రహదారి పరిస్థితి దారుణంగా తయారైంది. ఈ రోడ్డులో కేవలం ట్రాక్టర్లు మాత్రమే వెళ్లేలా పరిస్థితి తయారైందంటే అతిశయోక్తి కాదు. ఉండి శివారు ఉప్పుగుంట, అర్తమూరు, చెరుకువాడ శివారు ప్రాంతాలను కలిపే 1.5 కి.మీ రోడ్డు ఇది. చెరుకువాడ, అర్తమూరు గ్రామాల ప్రజలు అతి దగ్గరగా ఉండికి రాగలిగే రోడ్డు ఇదే. అయితే ఈ రోడ్డును అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో అధ్వానస్థితికి చేరుకుంది. ఈ రోడ్డులో రెండు గ్రామాల శివారు ప్రాంతాల ప్రజలతో పాటు, వందలాది ఎకరాల ఆక్వారైతులు కూడా ప్రయాణిస్తూ ఉంటారు. వేసవికాలం, చలికాలంలో కొద్దిరోజులు మాత్రమే ఈ రోడ్డుపై వెళ్లే అవకాశం ఉంటుంది.

దిగబడిపోతున్న వాహనాలు

ఎవరైనా కొత్త వారు తెలియక ఈ రోడ్డులో ప్రయాణిస్తే వాహనాలు దిగబడిపోతున్నాయి. ముఖ్యంగా ఈ ప్రాంతంలో చెరువల ద్వారా వచ్చే ఆక్వా ఉత్పత్తులను అమ్ముకోవడానికి రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. వందలాది ఎకరాల ఆక్వాచెరువుల రైతుల ద్వారా ప్రభుత్వానికి ఎంతో ఆదాయం వస్తున్నా రోడ్డు వేసేందుకు మాత్రం ఎవ్వరూ ముందుకు రావడం లేదు. అధికారులు గానీ, ప్రజాప్రతినిధులు గానీ పట్టించుకోకపోవడంతో ఆక్వారైతులు గతేడాది సొంతంగా ఎకరాకు కొంతమొత్తం వేసుకుని రోడ్డు వేసుకున్నారు. అంతే తప్ప రోడ్డు వేసేందుకు ఎవ్వరూ ముందుకు రాకపోవడంతో ఆక్వారైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాయనివాని గూడెం వెళ్లేదెలా?

మండలంలోని యండగండి గ్రామ శివారు రాయనివాని గూడెం మీదుగా పాందువ్వ, ఆరేడు, ఉణుదుర్రు గ్రామాలకు వెళ్లాలంటే ప్రజలకు పట్టపగలే చుక్కలు కనిపిస్తున్నాయి. రోడ్డు అధ్వానస్థితికి చేరుకోవడంతో ప్రతిరోజూ ఉద్యోగాలకు, పాఠశాలలు, కళాశాలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యండగండి ప్రధాన గ్రామం నుంచి ఉప్పులూరు వెళ్లే రోడ్డులో నుంచి రాయనివాని గూడెం వళ్ళేందుకు 3.5 కి.మీ దూరం ఉంటుంది. ఈ రహదారి నుంచి పాందువ్వ, ఆరేడు గ్రామాలతో పాటు మరోవైపుగా ఉణుదుర్రు వెళ్లేందుకు అనుకూలంగా ఉండే రహదారి ప్రస్తుతం అధ్వానంగా మారింది. దీనిపై ప్రయాణించేందుకు స్థానికులు నానాపాట్లు పడుతున్నారు. కూటమి ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్న ప్రజలు ముప్పుతిప్పలు పడుతున్నారు.

పాలకులు పట్టించుకోవాలి



ప్రస్తుతం గ్రామీణ రహదారులపై ప్రయాణించాలంటే ప్రయాణికులకు పగలే చుక్కలు కనిపిస్తున్నాయి. అధ్వానమైన రోడ్లకు తోడుగా ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ఇబ్బందులు మరింతగా పెరిగాయి. గత ప్రభుత్వంపై దుమ్మెత్తిపోసిన కూటమి ప్రభుత్వం ఏడాది పాలన ముగిసినా ఇంకా గ్రామీణ రోడ్లను పట్టించుకోకపోవడం దారుణం.

– వెలగపలి టోనీ, యండగండి

రోడ్లు అభివృద్ధి చేయాలి



పల్లెలు అభివృద్ధి చెందాలంటే రోడ్లు బాగుండాలి. రోడ్లు బాగును కూటమి ప్రభుత్వం పట్టించుకోవాలి. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లోని లింక్‌రోడ్లు ఎంతో అధ్వానంగా మారిపోయాయి. వాటిని కూటమి ప్రభుత్వం పట్టించుకుని గ్రామీణ ప్రజల కష్టాలు తీర్చాలి. అధ్వాన రోడ్లకు కనీసం మరమ్మతులైనా చేయించాలి.

– గొంతే హరీష్, పాందువ్వ

శ్రీకూర్మ తటాకానికి విరాళం



తోలేరులో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వీరవాసరం: మండలంలోని తోలేరులో శ్రీ వల్లిదేవసేన సహిత షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన శ్రీకూర్మ తటాకానికి రూ.25వేలు నగదును మంగళవారం ఆలయ అధ్యక్షుడు చావాకుల సత్యనారాయణ మూర్తికి అందజేశారు. మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తనయుడు గ్రంధి సత్య రవితేజ– గ్రంధి లక్ష్మిప్రత్యూష దంపతులు ఈ విరాళాన్ని అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రంధి లక్ష్మి ప్రత్యూష తండ్రి గన్నబత్తుల శ్రీనివాసరావును వారి కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించి అభినందించారు. ముందుగా స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు దుర్మార్గం

- బాబును మించిన నేరగాడు లేడు
- వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కోడే విజయలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా మహిళ అధ్యక్షురాలు విజయలక్ష్మి

భీమవరం (ప్రకాశంచౌక్): వైఎస్సార్ సీపీ ఎంపీ మిథున్‌రెడ్డిపై అక్రమ కేసు బనాయించి, అరెస్టు చేయడం కూటమి ప్రభుత్వ దుర్మార్గ పాలనకు అద్దం పడుతుందని వైఎస్సార్ సీపీ మహిళాధ్యక్షురాలు కోడే విజయలక్ష్మి మండిపడ్డారు. మంగళవారం భీమవరంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మిథున్‌రెడ్డి అరెస్టు కూటమి ప్రభుత్వ కక్ష సాధింపు చర్యల్లో భాగమన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను, అణిచివేత ధోరణులను వైఎస్సార్ సీపీ ఎప్పటికప్పుడు ప్రజల్లో ఎండగడుతుందని, దానిని ఓర్వలేక తమ పార్టీ నేతలపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారన్నారు. ప్రజాక్షేత్రం నుంచి జైళ్లలో వేయడం ద్వారా కూటమి నేతలు తమ ప్రభుత్వాన్ని రక్షించుకోవాలని చూస్తున్నారని, వాస్తవానికి ఏ ఒక్క వైఎస్సార్ సీపీ నాయకుడు, కార్యకర్త అణిచివేతలకు భయపడరన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం, కక్ష సాధింపుతోనే కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో మహిళలు, బాలికలపై లైంగిక దాడులు జరుగుతున్నా పట్టించుకోకుండా, కేవలం వైఎస్సార్ సీపీ నేతలపై ఎలా తప్పుడు కేసులు పెట్టి జైల్లో పెడదామనే దుర్మార్గపు ఆలోచనలతోనే పాలన చేస్తున్నారని మండిపడ్డారు. అక్రమ కేసులు, కక్ష సాధింపు చర్యలపై కోర్టులు ఆక్షింతలు వేస్తున్నా కూటమి ప్రభుత్వానికి పట్టడం లేదని ధ్వజమెత్తారు. ఎంపీగా, పార్లమెంట్‌లో వైఎస్సార్ సీపీ ఫ్లోర్‌లీడర్‌గా మిథున్‌రెడ్డి పోలీసు దర్యాప్తునకు సహకరిస్తున్నా, సాక్ష్యాలను తారుమారు చేసి అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయమని ఖండించారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ విధిగా పాటించాలని జిల్లా రవాణా అధికారి టి ఉమామహేశ్వరరావు సూచించారు. డీఎన్నార్ కళాశాల ప్లాటినం జూబ్లీ హాల్ నందు మంగళవారం స్టూడెంట్స్, కాలేజీ బస్సు డ్రైవర్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. విద్యార్థులు వాహనాలు నడిపేటపుడు హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. వాహనాలను నెమ్మదిగా నడపాలన్నారు. ఈ కార్యక్రమంలో రవాణాశాఖ అధికారులు కె.ఎస్.ఎన్ ప్రసాద్, ఎన్.ఎల్.ఎస్ లక్ష్మి, ఏఎస్‌పి తేజ, ప్రిన్సిపాల్ జి.మోసెస్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌పై దాడి

భీమవరం (ప్రకాశంచౌక్): ఆటో కిరాయి బాకీల వివాదంలో వ్యక్తిని గాయపరిచిన సంఘటన భీమవరం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. టూటౌన్ పరిధిలోని దుర్గాపురానికి చెందిన లావణ్య అనే హిజ్రా గొల్లవానితిప్ప వెళ్లడానికి పాతబస్టాండ్‌లో ఆటో డ్రైవర్ తిరుమల ఆదినారాయణతో ఆటో కిరాయి మాట్లాడుకుంది. అతను పాత కిరాయి బాకీ కూడా చెల్లించాలని చెప్పగా లావణ్య, ఆదినారాయణ మధ్య ఘర్షణ నెలకొంది. వీరిఇరువురి మధ్య సమస్యను పరిష్కరించడానికి వెళ్లిన బాధితుడు బాలెం ఇజ్రాయ్‌ను లావణ్య చెక్క కర్రతో నుదటిపై కొట్టింది. రక్తస్రావంతో చికిత్స కోసం ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రెహమాన్ తెలిపారు.

1120 ఎకరాల్లో వరినాట్లు పూర్తి

భీమవరం అర్బన్: మండలంలోని సార్వా సాగులో 1,120 ఎకరాలలో వరినాట్లు పూర్తయ్యాయని మిగిలిన రైతులు త్వరితగతిన పూర్తి చేయాలని మండల వ్యవసాయాధికారి యర్రంశెట్టి ప్రసాద్ తెలిపారు. మండలంలో యనమదుర్రు, దిరుసుమర్రు, కొమరాడ, తాడేరు, బేతపూడి, రాయలం, చినఅమిరం, కొవ్వాడ అన్నవరం, తుందుర్రు తదితర గ్రామాల్లో 5,500 ఎకరాలలో సార్వా సాగుకు శ్రీకారం చుట్టారు. వర్షాలు పడటంతో వరినాట్లుకు ఆటంకం, రైతులందరూ ఒకేసారి వరినాట్లు వేయడం తదితర కారణాల వల్ల కూలీలు దొరకడం లేదని రైతులు చెబుతున్నారు. కొన్ని చోట్ల బెంగాళీ కూలీలను తీసుకువచ్చి వరినాట్లు వేస్తున్నారు. వరినాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు.

నేడు వైఎస్సార్ సీపీ మండల సమావేశం

యలమంచిలి: స్థానిక తమ్మినీడి ఉమానరసింహ కల్యాణ మండపంలో బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు వైఎస్సార్ సీపీ యలమంచిలి మండల స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ ఉచ్చుల స్టాలిన్‌బాబు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

భీమవరం (ప్రకాశంచౌక్): ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, ప్రజలు క్యాన్సర్ బారిన పడకుండా ఉండేందుకు ప్లాస్టిక్ నిషేధంపై ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు కూడా అవగాహన కల్పించడం గొప్ప విశేషమని ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి కమలాకర్ అన్నారు. ప్రభుత్వ ప్లాస్టిక్ నిషేధ కమిటీ ఆధ్వర్యంలో ప్లాస్టిక్‌ను నిషేధించాలంటూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమలాకర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ప్లాస్టిక్‌ను పారదోలి పర్యావరణాన్ని కాపాడాలని పిలుపు నిచ్చారు. ప్లాస్టిక్ నిషేధ కమిటీ సభ్యులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ గత 4 నెలలుగా పట్టణంలో ప్లాస్టిక్ నిషేధంపై విస్తృతంగా ప్రచారాలు, హెచ్చరికలు చేస్తున్నామని, కొంతమంది వ్యాపారస్తులకు జరిమానాలు విధించినట్లు తెలిపారు. అనంతరం కళాశాల నుంచి గంగులమ్మ అమ్మవారి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారిణి వి లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు పోడూరు ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన

పెనుగొండ: పండిత విల్లూరు సర్పంచ్ ఇళ్ల లక్ష్మీ చంద్రిక చెక్ పవర్ రద్దు చేయించడానికి వ్యతిరేకంగా పోడూరులో బుధవారం నిరసన వ్యక్తం చేయనున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకులు గుబ్బల వీరబ్రహ్మం, సుంకర సీతారామ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. పోడూరు ఎంపీడీఓ కార్యాలయం వద్ద బుధవారం ఉదయం 10 గంటల నుంచి నిరసన తెలుపుతామని స్పష్టం చేశారు.

ఎరువుల వాడకంలో జాగ్రత్తలు తీసుకోవాలి



కాళ్ల: రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయ అధికారి రమేష్ నాయుడు



ఉండి: చిలుకూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

కాళ్ల: ఎరువుల వాడకంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కాళ్ల మండల వ్యవసాయ అధికారి పి.రమేష్ నాయుడు రైతులకు తెలిపారు. మండలంలోని సీసలి, కాళ్ల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ నాయుడు మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్‌లో వరి పంటలోని సమగ్ర సస్యరక్షణపై జాగ్రత్తలు, ఎరువుల వాడకంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వీటిలో జీవన ఎరువులు ఎంతో కీలకమని, వాటి వల్ల కలిగే ప్రయోజనాలు తెలిపారు. వాతావరణ కాలుష్యం అరికట్టవచ్చుని వాతావరణంలో, నెలలో మొక్కలకు అందుబాటులేని పోషకాలను సులభంగా లభ్యమయ్యేటట్లు చేస్తాయని రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో సీసలి, కాళ్ల గ్రామ రైతులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

పంట బీమా చెల్లించాలి

ఉండి: రైతులంతా తప్పక పంట భీమాను చెల్లించాలని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం చిలుకూరులో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు పీఎంఎఫ్‌బీవైకి సంబంధించి క్రాప్ ఇన్సూరెన్స్ కోసం ప్రతిరైతూ ఆగస్టు 15లోపు రూ.210 ప్రీమియం ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని సూచించారు. దీని వల్ల ప్రకృతి వైపరీత్యాలు, పంట నష్టం సంభవించినప్పుడు రూ.42 వేలు పరిహారం లభిస్తుందని తెలిపారు. బ్యాంకుల నుంచి పంట రుణాలు తీసుకున్న రైతులు సదరు బ్యాంకు ద్వారానే ప్రీమియం చెల్లించాలని సూచించారు. రుణాలు తీసుకోని రైతులు మాత్రం గ్రామాల్లోని రైతు సేవాకేంద్రాల ద్వారా చెల్లించాలన్నారు.

ఎన్‌హెచ్ కోసం 150 అడుగుల భూసేకరణ



ఆకివీడు: భూయజమానులతో మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి



ఉండి: ఎన్నార్పీ అగ్రహారంలో సివిల్ సప్లయిస్ గోడౌన్‌ను పరిశీలిస్తున్న జేసీ

ఆకివీడు: జాతీయ రహదారి నెం.165కు బైపాస్ రోడ్డుగా ఉప్పుటేరు నుంచి అయిభీమవరం, అజ్జమూరు మీదుగా ఎన్‌హెచ్ పాత రోడ్డుకు వచ్చే మార్గంలోని భూముల సేకరణపై అభ్యంతరాలను మంగళవారం జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 150 అడుగుల వెడల్పున భూమి సేకరణ కొనసాగుతోందన్నారు. జాతీయ రహదారుల శాఖ, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన అవార్డు ప్రకారం భూ సేకరణ చేస్తామన్నారు. దీనిలో అభ్యంతరాలుంటే సానుకూలంగా పరిశీలిస్తామన్నారు. భూమి యజమానులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇటీవల ఆయా ప్రాంతాల్లో జరిగిన భూమి విలువలను పరిగణలోకి తీసుకుని ప్రభుత్వ నిబంధనల మేరకు సొమ్ము చెల్లిస్తారని చెప్పారు. వ్యవసాయ, వ్యవసాయేతర భూములను పరిశీలిస్తామన్నారు. వ్యవసాయేతర భూములు కన్వర్షన్ ఫీజు చెల్లించి ఉండాలని జేసీ తెలిపారు. భూ సేకరణకు సంబంధించి అజ్జమూరు ప్రాంతంలో 43 ఫిర్యాదులు అందినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్ డీఈ శ్రీనివాస్, జిల్లా కలెక్టరేట్ సూపరింటెండెంట్ సీహెచ్. రవికుమార్, తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు, సబ్‌రిజిస్ట్రార్ బీఎస్‌వీ.లక్ష్మి, డీటీ జి.కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

గోడౌన్స్ పరిశీలన

ఉండి: ఎన్నార్పీ అగ్రహారంలోని సివిల్ సప్లయిస్ గోడౌన్స్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎల్ఎస్ పాయింట్, బఫర్ గోదాములను ఆయన పరిశీలించారు. ప్రజలకు అందించే బియ్యం నాణ్యతను పరిశీలించి సేకరణ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రేషన్ దుకాణాలకు స్టేజ్–2 ద్వారా చేసే రవాణా గురించి అధికారులతో సమీక్షించారు. గోదాముల మరమ్మతులపై పరిశీలన చేసిన జేసీ గోదాములకు వెంటనే రిపేర్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ డీఎం ఎండీ ఇబ్రహీం, అధికారులు అష్ఫ, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

భీమవరం (ప్రకాశంచౌక్): కలెక్టరేట్‌లో పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేస్తున్న పంచాయతీ పొరుగు సేవల ఉద్యోగిని ధనాల లక్ష్మి(53) జులై 8న గుండెపోటుతో ఆకస్మికంగా మరణించింది. విధులు ముగించుకొని ఇంటికి వెళ్లిన ఆమెకు కొంత అస్వస్థతగా ఉండటంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుండెపోటుతో మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయమై స్పందించిన డీఆర్‌ఓ మొగిలి వెంకటేశ్వర్లు కలెక్టరేట్ కార్యాలయాల అధికారుల నుంచి కొంత మొత్తాన్ని సేకరించి వారి కోడలు ధనాల పెద్దింట్లకు ఆర్థిక సాయాన్ని అందజేశారు.

అమ్మవారికి ఆషాఢ సారె సమర్పణ



ఊరేగింపుగా సారె తీసుకెళ్తున్న భక్తులు

కాళ్ల: మండలంలోని పెదఅమీరం గ్రామంలో ఉన్న గ్రామ దేవత పల్లాలమ్మ వారికి మంగళవారం భక్తులు ఆషాఢ సారె సమర్పించారు. పలు రకాల స్వీట్లు, పండ్లు, పసుపు, కుంకుమ, గాజులతో మంగళవాయిద్యాల నడుమ బాణసంచా కాల్పులతో సుమారు 300 మంది మహిళలు సారె బిందెలు, కావిళ్లతో ఊరేగింపుగా గ్రామోత్సవం నిర్వహించి అమ్మవార్లకు సారె సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు, ఉప సర్పంచ్ జావ్వది కిషోర్, గ్రామ పెద్దలు కోరా రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా వాసవీమాత

ఆకివీడు: స్థానిక ఆర్యవైశ్య కల్యాణమందిరం వద్ద ఉన్న వాసవీ మాత ఆలయంలో అమ్మవారిని శాకంబరి అలంకరణలో మంగళవారం భక్తులు దర్శించుకున్నారు. వివిధ రకాల కూరగాయలతో అమ్మవారికి అలంకరణ చేశారు. అనంతరం అమ్మవారికి ఆర్యవైశ్య మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. ఆషాఢ మాస సారెను సమర్పించారు. స్థానిక దుంపగడప రైల్వే గేటు వద్ద ఉన్న కనకదుర్గమ్మ వారి ఆలయంలో అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు ఊరేగింపుగా ఆషాఢ మాస సారెను తీసుకువచ్చారు.